

సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి

రైతులకు అన్యాయం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపణ
- రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి

పంజాగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని హైకోర్టు న్యాయవాది పి.శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. దేశంలో నిమిషానికో రైతు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరామ్ రెడ్డి, డి.విజయ్ పాల్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు తీవ్ర అన్యాయం చేసేలా ఉందని, వ్యవసాయ రంగానికి తక్కువ కేటాయింపులు చేశారని ఆయన అన్నారు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ రైతులకు అనుకూలంగా ఉండాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. కేంద్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం ఉందని, వ్యవసాయ రంగం గురించి తెలియని వారు వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతుల జనాభా లెక్కలు సేకరించి వారికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో ప్రత్యేక కోటా కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉందో లేదో తెలియడం లేదని, సీఎం రేవంత్ రెడ్డి రైతులకు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సమాఖ్య నాయకులు ఎస్.రామస్వామి, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ అదుర్స్




బేగంపేట కంట్రీ క్లబ్‌లో గురువారం నిర్వహించిన ఫ్యాషన్ షోలో మోడళ్లు మోడ్రన్ దుస్తుల్లో మెరిశారు. క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్నారు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

మర్యాదపూర్వక కలయిక



ఇటీవల ఎన్నికైన పబ్లిక్ హెల్త్ అండ్ మునిసిపల్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీ.లక్ష్మీ గణేష్ తదితరులు రేవంత్‌ను కలిసిన వారిలో ఉన్నారు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

మతిస్థిమితం లేని యువకుడి ఆత్మహత్య

బోరబండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని యువకుడు తన ఇంటి పై నుంచి పొరుగింటి మిద్దెపై దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్ గంగానగర్‌కు చెందిన ఎండీ అబ్రార్ ఇలాహి(24) ఈ నెల 11న తప్పిపోయినట్టు తండ్రి ఎండీ బిలాల్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

షెల్టర్ హోంలో సమస్యలు

- యూసుఫ్‌గూడ అర్బన్ హోంలో 24 మందికి 8 బెడ్‌లు
- చెత్తతో నిండిపోయిన గది
- ఇబ్బందులు పడుతున్న నిరాశ్రయులు



యూసుఫ్‌గూడలోని షెల్టర్ హోం

బోరబండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి ఇబ్బందులు పడుతున్న నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ హోంలో సౌకర్యాలు కొరవడ్డాయి. యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయంలోని షెల్టర్ హోం ఫర్ అర్బన్ హోంలో 24 మంది యువకులు ఆశ్రయం పొందుతున్నారు. వారి కోసం కేవలం 8 బెడ్‌లు మాత్రమే ఉన్నాయి. ఒక బాత్ రూమ్, ఒక మరుగుదొడ్డి ఉంది. ఇలా అరకొర సౌకర్యాలతో సర్దుకుపోతున్నారు. అయితే ముందు ఉన్న రేకుల షెడ్డులో వాహనాల టైర్లు, డీజిల్, మెకానిక్ సామగ్రి, చేతి కర్రలను ఉంచారు. వేసవిలో బయట పడుకుందామన్నా ఇరుకుగానే ఉంటుంది. అప్పుడప్పుడు పోలీసులు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న యాచకులను ఇక్కడికి తీసుకువస్తుంటారు. అలాంటి సమయంలో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారి ఆదేశించినా..

యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయానికి జనవరి 8న అడిషనల్ కమిషనర్ వచ్చారు. కార్యాలయంపైన ఉన్న షెల్టర్ ఫర్ అర్బన్ హోంను పరిశీలించారు. హోంలో 8 నెలలుగా నిల్వ ఉంచిన సామగ్రి, చెత్త, వివిధ రకాల ఫైళ్లు అక్కడ ఉండటంతో వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అయితే ఆయన చెప్పి నెల రోజులు దాటినా వాటిని తొలగించని పరిస్థితి నెలకొంది.


హోంలో ఉన్న టైర్లు, సామగ్రి

డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని అక్కడ ఆశ్రయం పొందుతున్న వారు కోరుతున్నారు.


వివేకానంద విగ్రహానికి హారతి ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ మఠం స్వామీజీలు, విద్యార్థులు

వివేకానంద సైనికులుగా యువత మారాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాంగోపాల్‌పేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద హైదరాబాద్ పర్యటన సనాతన ధర్మ చరిత్రలో, రామకృష్ణ మిషన్ చరిత్రలో మైలు రాయిగా నిలుస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని స్వామి వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్వీఐటీ)లో మహబూబ్ కాలేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ, రామకృష్ణ మఠం సంయుక్తంగా నిర్వహించిన యూత్ కన్వెన్షన్‌లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద 1893 ఫిబ్రవరి 13న తన జీవితంలో తొలిసారిగా ఓ బహిరంగ సభను ఉద్దేశించి సికింద్రాబాద్ మహబూబ్ కాలేజ్ ప్రాంగణంలో ప్రసంగించారని గుర్తుచేశారు. అమెరికాలోని చికాగోలో జరిగిన విశ్వమత సభలో స్వామి వివేకానంద ప్రసంగానికి నాంది మహబూబ్ కాలేజీలో చేసిన ప్రసంగమని, చికాగో ప్రసంగంలో వేదాలు, పురాణాలు, అనుష్ఠాన వేదాంతం గురించి వివేకానంద చెప్పారన్నారు. ఇనుప కండలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత భారత్‌ను విశ్వగురువుగా చేయగలదని గవర్నర్ ధీమా వ్యక్తం చేశారు. యువత స్వామి వివేకానంద సైనికులుగా మారి ఆయన కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. వివేకానంద బోధనలతో ఆత్మవిశ్వాసం, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బోల్టన్ స్కూల్ ఛైర్మన్ రవీంద్రనాథ్, మహబూబ్ కాలేజ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పీఎల్ శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ ప్రేమ్ నారాయణ్, నరేష్ యాదవ్, భగవత్ వారణాసి, వినోద్ కుమార్, రామకృష్ణ మఠం స్వాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి

- మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

పంజాగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. అశాస్త్రీయంగా ఉన్న ఎస్సీ వర్గీకరణను తాము వ్యతిరేకిస్తున్నామని, నేటి తెలంగాణ బంద్‌తో మాల సంఘాల జేఏసీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో జేఏసీ కో చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నె శ్రీధర్ రావులతో కలిసి ఆయన మాట్లాడారు.తమ జనాభా ప్రకారం 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మంద కృష్ణమాదిగను ఇంటికి పిలిపించుకుని మాట్లాడి, ఆయన చెప్పినట్లు సీఎం రేవంత్ రెడ్డి చేశారని.. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. నేతకాని కులానికి చెందిన వారిని పక్కన పెట్టుకుని తమ మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు మాదిగలను కూడా మోసం చేస్తున్న మందకృష్ణ ఏ ఉద్యమం చేశారని ప్రశ్నించారు. తమకు జరుగుతున్న అన్యాయంపై మాల ఎమ్మెల్యేలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. తాము పోరాడుతుంటే మాట్లాడని మాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తమ పదవులకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో వారి ఇళ్లను ముట్టడిస్తామని, ఎక్కడికక్కడ వారిని అడ్డుకుంటామని హెచ్చరించారు. లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించి తమ సత్తా చూపుతామని ఆయన వెల్లడించారు. గతంలో వర్గీకరణ జరిగినప్పుడు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తమకు ఆరు శాతం రిజర్వేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నెల 15 తరువాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

'నోటా' ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు


మాట్లాడుతున్న పి.సాధలరుణ

పంజాగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నోటా అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు అని, 2032 నాటికి వంద నియోజకవర్గాలలో వంద శాతం ఓటింగ్ జరుగుతుందని అఖిల భారత నోటా రాజ్యాంగ ముసాయిదా సభ చైర్మన్ పి.సాధలరుణ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. తమ పోరాటం ఫలితంగా నోటాకు ఒక గుర్తు వచ్చిందని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నోటా మరోసారి వెలుగులోకి వచ్చిందని, ఎన్నిక ఏకగ్రీవం అయినా సరే పోటీలో నోటా ఉంటుందని అధికారులు తెలిపారన్నారు. 2032లో వంద నియోజకవర్గాలలో వంద శాతం ఓటింగ్ జరుగుతుందని, వంద నియోజకవర్గాలలో నోటాకు అధిక ఓట్లు వస్తాయని చెప్పారు. ఎన్నికల్లో నోటాకు మొదటి స్థానం వస్తే ఆ ఓట్లు రద్దు కావన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి జిల్లా లోక్ అదాలత్ జడ్జి అమిత రాణి, నిర్వాహకులు

మార్చి 2న రన్ ఫర్ హియరింగ్

- 3 నుంచి 10 వరకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ హియరింగ్ డేను పురస్కరించుకుని మౌర్య ఫౌండేషన్, మైక్రో ఈఎన్‌టీ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వినికిడి సమస్యలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. మార్చి 2న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో డిజేబుల్ డాష్ 2025-రన్ ఫర్ హియరింగ్ పేరుతో 2కె, 5కె, 10కె, వర్చువల్ రన్ నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ వి.శ్రీప్రకాష్ తెలిపారు. గురువారం పంజాగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా లోక్ అదాలత్ జడ్జి అమిత రాణి, తెలంగాణ ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్ అసోసియేషన్ సలహాదారు డా. ప్రేమ్‌నాథ్ బల్లా, టీపీసీసీ ఎన్ఆర్ఐ అఫైర్స్ సమన్వయకర్త దేవేందర్ రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీప్రకాష్ మాట్లాడుతూ.. మార్చి 2న ఉదయం 6 గంటల నుంచి 2కె ఫన్ వాక్, 5కె, 10కె రన్, వర్చువల్ రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మార్చి 3 నుంచి 10వ తేదీ వరకు మైక్రోకేర్ ఈఎన్‌టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జూబ్లీహిల్స్, కేపీహెచ్‌బీ కాలనీ బ్రాంచ్‌లలో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తారని. వినికిడి లోపాలతో బాధపడుతున్న వారు తమ ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9122233354, 9122233374 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ అశ్విని, డాక్టర్ సోనాలి చతుర్వేది, శిరీష, భారతి, శ్రీపూజ పాల్గొన్నారు.

16న సీవీ రామన్ అవార్డుల ప్రదానం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్ లలిత కళా తోరణంలో సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులను అందజేస్తామని సంస్థ ప్రతినిధి లయన్ కిరణ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్ మెడల్, గురుబ్రహ్మ, చిత్రలయ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా సుచిరిండియా అధినేత డాక్టర్ లయన్ కిరణ్, సినీ నటుడు రావు రమేష్ హాజరవుతారని చెప్పారు.

'మనూ'లో పార్ట్‌టైం పీహెచ్‌డీ కోర్సులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో స్పాన్సర్డ్, సెల్ఫ్‌ఫైనాన్సింగ్ మోడ్‌లో పార్ట్‌టైం పీహెచ్‌డీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎం.వనజ తెలిపారు. కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సైన్స్, ఎడ్యుకేషన్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, సోషల్ సైన్సెస్, హిస్టరీ విభాగాల్లో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశముందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 17 ఆఖరు తేదీ. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం మనూ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.


కేటీఆర్‌కు సిద్ధాంత గ్రంథాన్ని అందజేస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

కేటీఆర్‌ను కలిసిన ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నాగర్ కర్నూల్ కమిటీ ప్రతి నిధులు మాజీ మంత్రి కేటీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిసి ప్రబోధ, సుబోధ త్రైత సిద్ధాంత భగవద్గీతను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు మంతటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులు

కేంద్ర బడ్జెట్‌పై నాలెడ్జ్ టెస్ట్

పంజాగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల(ఐఐఎంసీ) ,ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్, వాసవి క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం డిగ్రీ, పీజీ విద్యార్థులకు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నాలెడ్జ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బడ్జెట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డి.తిరుమలేష్ మొదటి బహుమతి రూ.3 వేలు, ఎస్.కల్యాణ్ రాజ్ రెండవ బహుమతి రెండు వేల రూపాయలు, కె.కావ్యశ్రీ మూడవ బహుమతి వెయ్యి రూపాయలు, సౌరబ్ సింగ్, డి కావ్యశ్రీ, ఎన్.శ్రీజ, జి.జాశ్విని, సన్నదికలకు ప్రోత్సాహక బహుమతులుగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందజేశారు.

బీసీలను మోసం చేస్తే సహించం

- బీసీ సాధికారత సంఘం నేత దేవయ్య పటేల్
- 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్


సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మరోసారి సర్వే పేరుతో బీసీలను మోసగించాలని చూస్తే సహించేది లేదని బీసీ సాధికారత సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ హెచ్చరించారు. పూర్తిస్థాయిలో ఇంటింటికి వెళ్లి రీసర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాదామి భూమన్న యాదవ్, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బీసీల సంఖ్య తగ్గించిందని, ఆధార్, ఓటరు కార్డు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల సంఖ్య కలిపి మొత్తం 4.25 కోట్ల జనాభా ఉండగా, తాజాగా విడుదల చేసిన కులగణన జాబితాలో కేవలం 3.64 కోట్ల జనాభా ఉన్నట్లు పేర్కొనడంతోనే ప్రభుత్వ ద్వంద వైఖరి స్పష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 80 శాతానికి పైగా బీసీలుంటే 46 శాతానికి తీసుకొచ్చారని, సుమారు 25 లక్షల మంది బీసీలను జనాభా లెక్కల నుంచి తొలగించారని ఆరోపించారు. మరో పది రోజుల్లో 3.1 శాతం మిగిలిన కులగణన చేపడతామని చెబుతున్నారని, అది సక్రమంగా నిర్వహిస్తారన్న నమ్మకం తమకు లేదన్నారు. తమిళనాడు మాదిరిగానే బీసీల రిజర్వేషన్లు పెంచాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని,బీసీల తరఫున అఖిలపక్ష కమిటీని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆరె కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చలపతి రావు, వివిధ సంఘాల నాయకులు కె.లక్ష్మణ్ పటేల్, పి.వాసు, బేరి రాంచందర్ యాదవ్, బి.శంకర్, మున్నూరు కాపు సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

- బేగంపేట డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బేగంపేట ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్తీలు, కాలనీల్లోని చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. వీటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో కుక్కలు, పోకిరీల ఆగడాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో కాకుండా అధికార పార్టీ నేతలు చెప్పిన చేసిన చోట వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డ, ఎస్‌బీటీ నగర్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, వడ్డెరబస్తీ, బేగంపేట బస్తీ, బ్రాహ్మణవాడి, మాతాజీనగర్, శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లోని చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు.


బేగంపేటలో వెలగని ఓ వీధి దీపం

పోకిరీలకు అడ్డాగా..

బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో కబరస్తాన్ పోకిరీలకు జూదగాళ్లకు అడ్డాగా మారింది. ఇక్కడ లైట్లు లేకపోవడంతో సాయంత్రం 6 గంటలకే పోకిరీలు తిష్టవేసి వచ్చి పోయే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో పాటు బ్రిడ్జి కింద గంజాయి బ్యాచ్ తిష్ట వేస్తోంది. బేగంపేట నుంచి బల్కంపేట వెళ్లే లింక్ రోడ్డులో చాలా చోట్ల వీధి దీపాలు వెలగక పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు



డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో వీధి లైట్ల సమస్య ఉంది. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. దీంతో ఇటీవల జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరా. త్వరలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.
- టి.మహేశ్వరి, బేగంపేట కార్పొరేటర్

కనుమరుగు కానున్న అల్వాల్ రైతుబజార్

- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు, వ్యాపారులు
- అదే ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

తిరుమలగిరి ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న అల్వాల్ రైతుబజార్ త్వరలో కనుమరుగు కానుంది. 2000 సంవత్సరంలో సుమారు ఎకరా 10 గుంటల్లో రైతు బజార్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి సిద్దిపేట, శామీర్‌పేట, మేడ్చల్, ములుగు, వర్గల్ మండలాలకు చెందిన 63 మంది రైతులు వారు పండించిన కూరగాయలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. దీంతో పాటు రైతుబజార్‌లో సుమారు 145 మంది స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకుని కూరగాయలు అమ్ముతున్నారు. ఈ క్రమంలో జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు ప్రభుత్వం నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా రైతుబజార్ కనుమరుగు అవుతుండటంతో జీవనోపాధిని కోల్పోతున్నామని కూరగాయల వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. తమకు ఇదే ప్రాంతంలో రైతుబజార్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కోరుతున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను బుధవారం ఆయన నివాసంలో కలిసి రైతులు సుమారు 1000 సంతకాలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఆదే ప్రాంతంలో రక్షణ శాఖ స్థలాలు అధికంగా ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి తిరిగి జీవనోపాధి కలిగించే విధంగా ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. రైతుబజార్ రాజీవ్ రహదారిని ఆనుకుని ఉండటంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉందని, కూరగాయలు కొనడానికి అధిక సంఖ్యలో వస్తున్నారని చెబుతున్నారు. ఇదే రహదారిని ఆనుకుని ఉన్న రక్షణ స్థలాల్లో రైతుబజార్‌ను ఏర్పాటు చేస్తే వ్యాపారులకు, వినియోగదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నారు.


అల్వాల్ రైతుబజార్

ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేయాలి



అల్వాల్ రైతుబజార్‌లో తాజా కూరగాయలు దొరుకుతాయి. రోజూ మార్కెట్‌కు వెళ్లి టిఫిన్ సెంటర్‌కు కావాల్సిన కూరగాయలు తీసుకుంటాను. గ్రామాల నుంచి రైతులు మంచి కూరగాయలు తెస్తారు. ఇదే ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

\- ఏసు, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

దూర ప్రాంతాలకు తరలించొద్దు



అల్వాల్ రైతుబజార్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో పోతున్నందున ప్రభుత్వం బొల్లారం పరిసర ప్రాంతాల్లో తిరిగి మార్కెట్ ఏర్పాటు చేయాలి. రక్షణ శాఖ స్థలాలు అధికంగా ఉన్న నేపథ్యంలో దూర ప్రాంతాలకు తరలించకుండా అక్కడ మార్కెట్ నిర్మాణం చేపట్టాలి.

\- ఉదయని, బొల్లారం నివాసి


వర్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యమే

మారేడుపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో కృషి చేస్తే ఎంతటి విజయాన్ని అయినా సాధించడం కష్టమేమీ కాదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేటకు చెందిన నల్వారి పరమేష్ కుమార్తె వర్షిత రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని వర్షితను అభినందించారు. కాగా ఆమె ఈ నెల 11న లాలాపేట్‌లోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు మార్చిలో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. వర్షిత వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్ రాజు, కుమార్ యాదవ్, దేశపాక శ్రీనివాస్, అరుణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కలుషిత నీటి నివారణకు చర్యలు చేపట్టాలి

- కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి కలుషిత నీటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ, జలమండలి అధికారులకు సూచించారు. గురువారం నామాలగుండులో ఓ అపార్ట్‌మెంట్‌లో కలుషితనీరు వస్తుందని ఫిర్యాదు రావడంతో జలమండలి అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. తొందరగా సమస్యను పరిష్కరించి కలుషితనీటిని నివారించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ నివాసంలో జలమండలి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వేసవికాలం సమీపిస్తుందని నీటి కొరతలేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు నీటిని వృథా చేయవద్దని సూచించారు. డివిజన్‌లో పవర్ బోర్స్, చేతిపంపులు మరమ్మతులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జలమండలి మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.


అపార్ట్‌మెంట్‌లో సంపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ, అధికారులు


'మనూ'లో పార్ట్‌టైం పీహెచ్‌డీ కోర్సులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో స్పాన్సర్డ్, సెల్ఫ్‌ఫైనాన్సింగ్ మోడ్‌లో పార్ట్‌టైం పీహెచ్‌డీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎం.వనజ తెలిపారు. కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సైన్స్, ఎడ్యుకేషన్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, సోషల్ సైన్సెస్, హిస్టరీ విభాగాల్లో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశముందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 17 ఆఖరు తేదీ. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం మనూ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.


నూతన కమిటీ సభ్యులతో వ్యవస్థాపక అధ్యక్షురాలు అన్నపూర్ణ

లలిత విష్ణు పారాయణ సత్సంగ్ కమిటీ నియామకం

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల్లో భక్తిభావం పెంపొందించడానికి లలిత విష్ణు పారాయణ సత్సంగ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు అన్నపూర్ణ తెలిపారు. గురువారం కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర లలిత విష్ణుపారాయణ కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షురాలిగా వీరలక్ష్మీ, ఉపాధ్యక్షులుగా రంగమణి, ఎస్ఎస్ కుమారి, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మీ, సహాయ కార్యదర్శి సరోజినిదేవి, శ్రీదేవి, కార్యనిర్వాహక కార్యదర్శులు వాణి, విజయలక్ష్మీ, కోశాధికారిగా అరుణలను ఎన్నుకున్నారు.


ఐఎఫ్‌పీ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్స్

డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు (ఐఎఫ్‌పీ)లను సరఫరా చేసింది. ఇందులో భాగంగా ఐఎఫ్‌పీలపై బోధించడానికి ఉపాధ్యాయులకు కొన్ని పాఠశాలల్లో ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. సికింద్రాబాద్ మండల పరిధిలో సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ ఈఓ శ్రీధర్ సూచనల మేరకు ఇంటర్‌నెట్ ద్వారా బోధనా పద్ధతులు, గణిత శాస్త్రాన్ని విద్యార్థులకు ఏ విధంగా బోధించాలో గురువారం బన్సీలాల్ పేట్‌లోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన 25 మంది గణిత ఉపాధ్యాయులు పాల్గొనగా జిల్లా రిసోర్స్ పర్సన్ నారాయణరెడ్డి, డీఐఓ కస్తూరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్నమాల, ఉపాధ్యాయులు శైలేందర్, భూపాల్ పాల్గొన్నారు.


బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సంధ్యలక్ష్మి

బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడికి సన్మానం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్‌ను సంధ్యలక్ష్మి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి గజమాల, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ మహిళా మోర్చా విభాగంలో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధి కోసం శ్రమించి పనిచేస్తున్నామన్నారు. అధ్యక్షుడిని కలిసిన వారిలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పూస రాజు, రమేష్‌గౌడ్, వెంకటేశ్‌యాదవ్, నగేష్, మహేష్, పద్మ పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో రోడ్ల నిర్మాణం


బోయిన్‌పల్లి నెల్లూరు పోచమ్మ ఆలయం వద్ద నిర్మించిన బీటీ రోడ్డు

బోయినపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఎట్టకేలకు బోయిన్‌పల్లి ప్రాంతంలో కొత్త రోడ్లను నిర్మించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఈ రోడ్లపై ప్రయాణించేదేలా' కథనానికి కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, అధికారులు స్పందించారు. బోయినపల్లి ప్రాంతంలోని సీఎంఆర్ స్కూల్, మాల్లారెడ్డిగార్డెన్, సీతారాంపురం, నెల్లూరు పోచమ్మ, స్పెన్సర్ సూపర్‌మార్కెట్, మహాత్మానగర్ ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో పాడైన రోడ్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశాన్ని నిర్వహించి నూతన రోడ్ల నిర్మాణానికి రూ.20లక్షల నిధులను కేటాయించి నూతన రోడ్లను నిర్మించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం


రహీమా బీబీ

తిరుమలగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళా కూలీ అదృశ్యమైంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన సారీఫుల్ మండల్, రహీమ బీబీ భార్యభర్తలు. వీరిద్దరూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టిమ్స్ ఆస్పత్రి నిర్మాణంలో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఈనెల 8న సాయంత్రం ఇద్దరు గొడవపడ్డారు. అదే రాత్రి రహీమ బీబీ బయటికి వెళ్లి తిరిగి రాలేదు. వెస్ట్‌బెంగాల్‌లోని ఆమె తల్లిదండ్రులు, బంధువులతో పాటు నగరంలో కూడా వెతికినా ఎక్కడ కనపడలేదు. దీంతో సారీఫుల్ మండల్ గురువారం బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రహీమ బీబీ బయటకు వెళ్లే సమయంలో ఒంటిపై నేవీబ్లూ కుర్తా, తెల్లరంగు పైజామా ధరించి ఉందని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు బొల్లారం పోలీస్‌స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వివేకానంద సైనికులుగా యువత మారాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద హైదరాబాద్ పర్యటన సనాతన ధర్మ చరిత్రలో, రామకృష్ణ మిషన్ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని స్వామి వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్వీఐటీ)లో మహబూబ్ కాలేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ, రామకృష్ణ మఠం సంయుక్తంగా నిర్వహించిన యూత్ కన్వెన్షన్‌లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద 1893 ఫిబ్రవరి 13న తన జీవితంలో తొలిసారిగా ఓ బహిరంగ సభను ఉద్దేశించి సికింద్రాబాద్ మహబూబ్ కాలేజ్ ప్రాంగణంలో ప్రసంగించారని గుర్తుచేశారు. అమెరికాలోని చికాగోలో జరిగిన విశ్వమత సభలో స్వామి వివేకానంద ప్రసంగానికి నాంది మహబూబ్ కాలేజీలో చేసిన ప్రసంగమని, చికాగో ప్రసంగంలో వేదాలు, పురాణాలు, అనుష్ఠాన వేదాంతం గురించి వివేకానంద చెప్పారన్నారు. ఇనుప కండలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత భారత్‌ను విశ్వగురువుగా చేయగలదని గవర్నర్ ధీమా వ్యక్తం చేశారు. యువత స్వామి వివేకానంద సైనికులుగా మారి ఆయన కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. వివేకానంద బోధనలతో ఆత్మవిశ్వాసం, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బోల్టన్ స్కూల్ చైర్మన్ రవీంద్రనాథ్, మహబూబ్ కాలేజ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పీఎల్ శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ ప్రేమ్ నారాయణ్, నరేష్ యాదవ్, భగవత్ వారణాసి, వినోద్ కుమార్, రామకృష్ణ మఠం స్వాములు, విద్యార్థులు పాల్గొన్నారు.


వివేకానంద విగ్రహానికి హారతి ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్


కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ మఠం స్వాములు, విద్యార్థులు

స్కూటీ పైనుంచి పడి వ్యక్తి మృతి

హయత్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్కూటిపై నుంచి కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం ఐపీడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన సత్తిపాటి శివాజీ(26) వృత్తి వస్త్ర వ్యాపారం. మంగళవారం సాయంత్రం శివాజీ తన స్కూటిపైన హయత్‌నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వైపుకు వెళ్తుండగా పెద్దఅంబర్‌పేట్ ఫ్లైఓవర్ పైన ప్రమాదవశాత్తు స్కూటిపై నుంచి కింద పడ్డాడు. దీంతో తలకు, కాలు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు శివాజీని 108లో వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివాజీ చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. శివాజీ చెల్లెలు పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- 71 కేసులు నమోదు.. వాహనాలు సీజ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సీపీ సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఇసుక అక్రమరవాణాపై నిఘా పెట్టిన రాచకొండ పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కమిషనరేట్ పరిధిలోని నాలుగు జోన్లలో 107 మందిపై 71 కేసులు నమోదు చేశారు. అంతే కాకుండా అక్రమంగా తరలిస్తున్న 3,762 టన్నుల ఇసుకతోపాటు ఇసుకను తరలిస్తున్న 9 లారీలు, 5 టిప్పర్‌లు, ఒక మినీ వ్యాన్, 8 ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇసుక అక్రమరవాణా చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్న సీపీ సుధీర్‌బాబు ఇకముందు కూడా ఇదే తరహాలో దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

మద్యం ఎరవేసి పాత నేరస్థుడి అరెస్టు

సైదాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మామా అంటూ పరిచయం చేసుకుని బర్త్‌డే పార్టీ ఇస్తానని వైన్స్‌కు తీసుకువెళ్లి మద్యం తాగిన తరువాత దాడిచేసి నిలువుదోపిడీ చేసిన పాత నేరస్థుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద అరతులం బంగారు ఉంగరం, మొబైల్ ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వెంకన్ననాయక్ వివరాలు వెల్లడించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. చంపాపేట ప్రధాన రహదారిపై ఉన్న 50 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. దోపిడీకి పాల్పడింది కర్నూల్ జిల్లా నల్లచెలిమలకు చెందిన మాల తిరుపాలు(48)గా గుర్తించి బుధవారం అరెస్టు చేసి చోరీ సొత్తు అరతులం బంగారు ఉంగరం, మొబైల్ ఫోన్, అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నగరానికి వలసవచ్చి మల్లాపూర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనిపై గతంలో మట్టేవాడ, సైదాబాద్‌లో రెండు, ఎల్బీనగర్, చైతన్యపురి పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదైనట్లు ఏసీపీ తెలిపారు.

16న సీవీ రామన్ అవార్డుల ప్రదానం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్ లలిత కళా తోరణంలో సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులను అందజేస్తామని సంస్థ ప్రతినిధి లయన్ కిరణ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహించించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్ మెడల్, గురుబ్రహ్మ, చిత్రలయ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.

మీ సేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ


మీ సేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మీ సేవా కేంద్రంలో రేషన్‌కార్డు దరఖాస్తుదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్ హెచ్చరించారు. మీ సేవ కేంద్రాల్లో రోజు రోజుకు రేషన్‌కార్డు దరఖాస్తులు పెరుగుతుండడంతో గురువారం తుకారాంగేట్‌లో ఉన్న కేంద్రాన్ని తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దరఖాస్తుదారులతో మాట్లాడుతూ మీ సేవ కేంద్రాల్లో అదనంగా డబ్బులు వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు.

జిరాక్స్ కాపీకి రూ.10 వసూలు

రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల సంఖ్య పెరగడంతో తుకారాంగేట్‌లో ఉన్న కొన్ని జిరాక్స్ సెంటర్లలో రేషన్‌కార్డు ఫారాలకు ఒక రూపాయి జిరాక్స్‌కు ఏకంగా రూ.10 వసూలు చేస్తుండడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 10 రూపాయలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని కొందరు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అదనంగా వసూలు చేస్తున్న జిరాక్స్ సెంటర్‌లో కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

పాలిసెట్ నోటిఫికేషన్ ఎప్పుడు?

- అభ్యర్థుల ఎదురుచూపులు
- నాన్ లోకల్ కేటగిరీ ప్రవేశాలకు అర్హతపై వీడని సస్పెన్స్
- డిప్లొమా కోర్సులపై మక్కువ చూపుతున్న నగర విద్యార్థులు


హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్)-2025 నోటిఫికేషన్ జారీ ఈ ఏడాది మరింత ఆలస్యం కానుందా.. అంటే సంబంధిత విభాగం అధికారుల నుంచి అవుననే జవాబు వస్తోంది. వాస్తవానికి ప్రతియేటా ఏప్రిల్/మే నెలల్లో నిర్వహించే పాలిసెట్ నిమిత్తం జనవరిలోనే నోటిఫికేషన్‌ను సాంకేతిక విద్యాశిక్షణా మండలి జారీచేస్తుంది. అయితే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండువారాలు దాటినా, నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి పదేళ్ల పూర్తయిన నేపథ్యంలో నాన్‌లోకల్ కేటగిరీలో ఏపీ అభ్యర్థులకు ప్రవేశాల అర్హతపై సస్పెన్స్ నెలకొంది. ఈ విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడమే నోటిఫికేషన్ జారీలో ఆలస్యానికి కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నెలాఖరులోగా నోటిఫికేషన్ జారీచేసే అవకాశం ఉందని చెబుతున్నారు. లక్షలమంది విద్యార్థులకు సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వ వెంటనే స్పందించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డిప్లొమా స్థాయిలోనే అధునాతన టెక్నాలజీస్

సాధారణంగా బీటెక్, ఎంటెక్ స్థాయిల్లో యూనివర్సిటీలు విద్యార్థులకు పరిచయంచేసే అధునాతన టెక్నాలజీస్ పాలిటెక్నిక్ విద్యలోనే లభిస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, బిగ్‌డేటా అండ్ క్లౌడ్ కంప్యూటింగ్ కోర్సులను గత నాలుగేళ్ల నుంచి మారేడ్‌పల్లిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్‌లోనూ, పలు ప్రైవేటు పాలిటెక్నిక్‌లలోనూ బోధిస్తున్నారు. అయా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ సంస్థల నుంచి ఆఫర్లు వస్తుండడంతో, ఆ కోర్సులను బోధించేందుకు మరిన్ని ప్రైవేటు పాలిటెక్నిక్‌లు మొగ్గు చూపుతున్నాయి. ఇవికాక సంప్రదాయ సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ.. తదితర ఇంజనీరింగ్ కోర్సులతో పాటు పలు యూనివర్సిటీలు అందించే నాన్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలను కూడా పాలిసెట్ ర్యాంకు ఆధారంగా కల్పిస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అందించే వ్యవసాయ డిప్లమో కోర్సులు, శ్రీ కొండా లక్ష్మణ్ రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీ అందించే ఉద్యానవన డిప్లమో కోర్సులు, పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ అందించే డిప్లమో కోర్సుల అడ్మిషన్లు కూడా పాలిసెట్ ర్యాంకుతోనే కల్పిస్తుండడం గమనార్హం.

డిప్లొమా కోర్సులపై పెరిగిన మక్కువ

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ఇంజనీరింగ్/నాన్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలను రాష్ట్ర సాంకేతిక విద్యామండలి నిర్వహిస్తోంది. డిప్లమో కోర్సులు పూర్తిచేసి త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలనుకునే టెన్త్ పాసైన విద్యార్థులు పాలిసెట్ రాసేందుకు మక్కువ చూపుతున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువమంది పోటీపడగా, గత కొన్నేళ్లుగా పట్టణ ప్రాంత విద్యార్థులు సైతం డిప్లమో కోర్సులకు ఆకర్షితులవుతున్నారు. గత మూడేళ్లుగా పాలిసెట్‌కు దరఖాస్తుల సంఖ్య భారీగా పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. గతేడాది పాలిసెట్‌కు 1.25 లక్షలకు పైగా దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు కొన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు 42:36:22 నిష్పత్తిలో సీట్ల కేటాయింపు ఉండడంతో ఆ ప్రాంతాల విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.



ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, మారేడ్‌పల్లి